ప్రజాశక్తి
శుక్రవారం 20 జనవరి 2023
5
శ్రీకాకుళం

ఉపకార వేతనాలు జమ

శ్రీకాకుళం అర్బన్: జాతీయ స్థాయిలో 2020-21, 2021-22 విద్యా సంవత్సరాలకు గానూ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు, నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పి 2.0)లో నమోదు చేసుకున్న కొత్త, రెన్యువల్ విద్యార్థులకు వారి బ్యాంకు ఖాతాలకు ఉపకార వేతనాలను జమ చేసినట్లు డిఇఒ జి.పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ నుంచి ఈమేరకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. కొందరు బ్యాంకు అకౌంట్ వివరాలు తప్పుగా నమోదు చేసుకున్న విద్యార్థులకు నగదు జమ చేయడం వీలు కాకపోవడంతో వారి అప్లికేషన్‌లో నమోదు చేసిన మొబైల్ నంబరుకు ఎస్ఎంఎస్ ద్వారా సంక్షిప్త సందేశం పంపినట్లు తెలియజేశారని పేర్కొన్నారు. స్కాలర్ జమ కాని విద్యార్థులు స్టూడెంట్ లాగిన్‌లో వారి వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. లేకుంటే నగదు జమ చేయడానికి వీలుండదని పేర్కొన్నారు.

విద్యుత్ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా

రేపు నిరసనలు

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కార్పొరేట్లకు వరాలు, పేదలపై భారాలు వేసే విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఈనెల 21న జిల్లావ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రమాదకర విద్యుత్ సంస్కరణలు ముందుకు తెచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం వాటికి పూర్తిగా దాసోహమైందని విమర్శించారు. రాష్ట్రంలో 1.89 కోట్లు, జిల్లాలో 9.25 లక్షల విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్, స్మార్ట్ మీటర్లు బిగించడానికి రంగం సిద్ధమైందని తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు వరాల జల్లు, ప్రజలపై భారాలా అని ప్రశ్నించారు. వ్యవసాయ విద్యుత్ పేరుతో ఆదానీ కంపెనీలతో 30 ఏళ్ల పాటు ఏడు వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందాన్ని గుట్టుచప్పుడు కాకుండా కుదుర్చుకుందని విమర్శించారు, హిందుజా కంపెనీకి నియంత్రణ మండలి యూనిట్‌కు రూ.3.82 చెల్లించాలని నిర్ణయించిందని, ఆ రేట్లు చాలవని అదనంగా రూ.1200 కోట్లు చెల్లించాలని కంపెనీ పైరవీలు ప్రారంభించిందని తెలిపారు.

2023-24 సంవత్సరంలో లోటుగా చూపబడిన రూ.13 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీగా ఇవ్వాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించరాదని, నివాసాలకు, వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను విరమించుకోవాలని, ట్రూ అప్ ఛార్జీల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా విద్యుత్ ఛార్జీలను సవరించాలని కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికే వసూలు చేస్తున్న ట్రూ అప్ ఛార్జీలను నిలిపివేయాలని, ఎస్‌సి, ఎస్‌టి తదితరులకు ఇస్తున్న విద్యుత్ రాయితీలు సంపూర్ణంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కె.మోహనరావు, జి.సింహాచలం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

పకడ్బందీగా కానిస్టేబుల్ రాత పరీక్ష

- గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యాన కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షను శ్రీకాకుళం, టెక్కలి కేంద్రంగా ఈనెల 22వ తేదీన పకడ్బందీగా నిర్వహించనున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు, ఇతర ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శ్రీకాకుళం రీజియన్ పరిధిలోని శ్రీకాకుళం టౌన్, రూరల్, ఎచ్చెర్ల, పొందూరు, టెక్కలి రీజియన్ పరిధిలోని టెక్కలి, నరసన్నపేట, కాశీబుగ్గ, కోటబొమ్మాళి కేంద్రాలుగా మొత్తం 72 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మొత్తం 23,735 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఇందులో 18,151 మంది పురుషులు, 5,584 మహిళలు ఉన్నారన్నారు. 22న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కానిస్టేబుల్ నియామక ప్రిలిమినరీ రాత పరీక్ష ఉంటుందని చెప్పారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తున్నట్లు తెలిపారు. పది గంటలకు ఒక నిమిషం దాటినా అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఆయా పరిధిలోని పరీక్షా కేంద్రాలను సంబంధిత పోలీసు అధికారులు తనిఖీ చేశారని తెలిపారు. పరీక్షా కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. మాల్ ప్రాక్టీసుకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షా కేంద్రానికి వెళ్లే అభ్యర్థులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఆర్‌టిసి బస్సులతో పాటు అవసరమైన ఆటోలు అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా ఒక ఒరిజినల్ ఐడెంటిటీ కార్డుతో వస్తేనే పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నట్లు స్పష్టం చేశారు. అంతకుముందు శివానీ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో చీఫ్ ఇన్విజిలేటర్స్ సూపరింటెండెంట్స్, పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, పరీక్ష నోడల్ అధికారి, డిఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పిలు ఎం.మహేంద్ర, జి.శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఎస్.బాలరాజు, రీజనల్ కో-ఆర్డినేటర్లు ఎ.శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు, చీఫ్ ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

అభివృద్ధి పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తొగరాంలో తన నివాసంలో ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాల పంచాయతీరాజ్, గృహ నిర్మాణ, గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు భాగస్వామ్యం కావాలని, చేపడుతున్న పనుల తీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలని తద్వారా దీర్ఘకాలికంగా మన్నికనిస్తాయని చెప్పారు. మండలాల్లో చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నత్తనడకన సాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో స్పందించకుంటే నోటీసులు జారీ చేసి పనులు వేగవంతమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేసే రోడ్ల నిర్మాణంలో జాప్యంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందన్నారు. గృహ నిర్మాణ పనులు నత్తనడకన సాగడంపై అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ పద్ధతి సరికాదని, పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం ఇప్పటికీ కొన్నిచోట్ల కల్పించలేదని, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. 90 రోజుల్లో ఇళ్ల పట్టాల కోసం అర్జీ పెట్టుకున్న లబ్ధిదారులకు స్థలాలను గుర్తించి వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిల ఏర్పాటు ఎంతవరకు వచ్చిందని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ప్రశ్నించారు. వేసవి కాలం ప్రారంభమయ్యే నాటికి ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. తాగునీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రారంభించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ఎన్.గణపతి, పిఆర్ ఎస్ఇ వి.ఎస్.ఎన్ మూర్తి, ఇఇ గిరిధర్, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాడాన సునీల్, సూర్యారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని

నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

వేమన చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎస్‌పి రాధిక

తెలుగు వెలుగు వేమన

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగు ప్రజలందరికీ తన పద్యాల ద్వారా వెలుగులు నింపిన మహాకవి వేమన అని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వేమన జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేట తెలుగు పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తన కవిత్వంతో సమాజాన్ని జాగృతం చేశారన్నారు. వేమన పద్యం రాని తెలుగు వారు ఉండరని, తెలుగు జాతి ఉన్నంత కాలం వేమన పద్యాలు ప్రజల నాలుకపై నిలిచే ఉంటాయన్నారు. తెలుగు భాష, భావంలో ప్రజలకు సాహిత్యాన్ని చేరువ చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, యూత్ కో-ఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కె.రామారావు, కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహా కవి వేమన : ఎస్‌పి

శ్రీకాకుళం: తన పద్యాలు తాత్పర్యంతో ప్రజలను మెప్పించిన మహాకవి వేమన అని ఎస్‌పి జి.ఆర్ రాధిక కొనియాడారు. గురువారం వేమన జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన పద్యాల ద్వారా ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడు వేమన అని అన్నారు. పండితుడు, గొప్ప సంఘ సంస్కర్త ఆయన పద్యాలు నేటికీ ఎంతో ఆదర్శమైనవని కొనియాడారు. కార్యక్రమంలో సెబ్ జాయింట్ డైరెక్టర్ ఎం.వి.నాగమణి, అదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు, డిఎస్‌సిలు, సిఐలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం

ఎపి ఫైబర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.జగన్మోహనరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎపి ఫైబర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిల్లా జగన్మోహనరావు అన్నారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఎపి ఫైబర్ కేబుల్ ఆపరేటర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపి ఫైబర్ గ్రిడ్‌ను మరింత విస్తృతం చేసి పటిష్టం చేశామని చెప్పారు. ప్రతి గ్రామ సచివాలయానికి ఫైబర్ లైన్లు వేశామని, అక్కడ ఆప్టికల్ లైన్ ట్రాన్స్‌మీటర్లను అమర్చనున్నట్లు తెలిపారు. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, ఆయా గ్రామాల్లోని ఇళ్లకు ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇళ్లకు ఇంటర్నెట్ కనెక్షన్ నెలకు కనిష్ఠంగా రూ.190 నుంచి పలు ప్యాక్‌ల్లో అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్రంలో ఎపి ఫైబర్ మాత్రమే టివి ఛానళ్లు, ఇంటర్నెట్, టెలిఫోన్ సౌకర్యాలతో కూడిన ట్రిపుల్ ప్లే సర్వీసులను అత్యంత నాణ్యంగా అందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో 80 లక్షల ఇళ్లకు సర్వీసులు అందించడానికి లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇందుకు కావాల్సిన సెట్ టాప్ బాక్స్‌లు, ఇతర పరికరాలు సంస్థ సమకూర్చుతోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎపి ఫైబర్ సేవలను విస్తరించాలని కోరారు. నెట్‌వర్క్‌లో ఎదురవుతున్న బిల్లింగ్, సాంకేతిక సమస్యలు, విస్తరణకు కావాల్సిన పరికరాలు అవశ్యకతను ఇడి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ మేనేజర్ గౌతమ్ కుమార్, టెక్నికల్ మేనేజర్ వేణు ప్రసాద్, ఎంటర్‌ప్రైజెస్ మేనేజర్ సాయికుమార్, జూనియర్ టెక్నికల్ మేనేజర్ జోగారావు, డిహెచ్‌క్యూ ఇంజినీర్ మురళీకృష్ణ, ఫైబర్ ఇన్‌ఛార్జి సాయికుమార్, ఆపరేటర్లు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగన్మోహనరావు

ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షునిగా

పురుషోత్తం నాయుడు

ఎన్నికైన పురుషోత్తం నాయుడు

వరుసగా ఐదోసారి ఎన్నిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షునిగా చౌదరి పురుషోత్తం నాయుడు ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతకుముందు మూడుసార్లు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు. వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఆయన ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘ కాలంగా అనేక పోరాటాల్లో చురుగ్గా వ్యవహరిస్తూ సంఘాన్ని పటిష్టపరచడానికి సమర్థవంతంగా పనిచేస్తున్నారు. మంచి మనిషిగా, మృదు స్వభావిగా ఉద్యోగుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే నేతగా ఆదరణ పొందారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులకు లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులతో చికిత్సను అందించడంలో ఆయన సేవలు ప్రశంసనీయం. కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి ఖరీదైన శస్త్రచికిత్సలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేందుకు ప్రముఖ పాత్ర పోషించారు. కారుణ్య నియమాకాల్లో ఎటువంటి పైరవీలకు తావివ్వకుండా, బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక ప్రయోజనంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచి ఉద్యోగాలు ఇప్పించేందుకు విశేష కృషి చేశారు. వాణిజ్య పన్నుల శాఖలో 800 మంది జిఎస్‌టిఒలకు గెజిటెడ్ హోదా సాధించడానికి పోరాడారు. ఆ క్రమంతో తన హోదాను సైతం త్యాగం చేసి అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ అధికారి పదవి నుంచి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా రివర్షన్ తీసుకున్నారు. పురుషోత్తం నాయుడు ఎన్నికపై ఎన్‌జిఒ నాయకులు, పలు సంఘాల నాయకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు రాయి వేణుగోపాల్ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

నేడు అభినందన సత్కారం

పురుషోత్తం నాయుడుకు అభినందన సత్కార సభను నగరంలోని సాయిబులతోటలోని ఆయన నివాసం వద్ద శుక్రవారం ఉదయం 8.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం తెలిపారు. ఎన్‌జిఒ సంఘ నాయకులు, జెఎసి నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అభిఆనులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

వంశధార నిర్వాసితులకు

పరిహారం చెల్లించాలి

వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- కొత్తూరు

సర్వం కోల్పోయిన వంశధార నిర్వాసితులకు 2013- భూసేకరణ చట్టం వర్తింపజేసి నష్ట పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గూనభద్రలో ఆయన పర్యటించారు. వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2005లో హిరమండలం రిజర్వాయరు, పారాపురం మినీ రిజర్వాయర్లను ప్రభుత్వం నిర్మించిందన్నారు. వీటి నిర్మాణంతో 460 కుటుంబాలు 600 ఎకరాలు కోల్పోయాయని అన్నారు. 18 ఏళ్లు అవుతున్నా నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. గత్యంతరం లేక నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించారని, దీంతో హైకోర్టు రెండు నెలల్లో లబ్ధిదారులను గుర్తించి పరిహారం చెల్లించాలని ఆదేశిస్తే ఆరు నెలలు గడిచినా రెవెన్యూ అధికారులు సర్వేచేసి, లబ్ధిదారులను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించే వరకు నిర్వాసితులు ఆందోళనకు సిద్ధం కావాలని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం, నిర్వాసితులు లంక పెద్దదోడు, చింతాడ రాజారావు, వి.శంకరరావు, జి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తి ఒక మొక్క నాటాలి

శ్రీదేవికి మొక్కను అందిస్తున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు

డిటిసి సిహెచ్.శ్రీదేవి

ప్రజాశక్తి - పలాస

వాహనం ఉన్న ప్రతి వ్యక్తి ఒక మొక్క నాటాలని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని జిల్లా రవాణా అధికారి సిహెచ్.శ్రీదేవి అన్నారు. కాశీబుగ్గ మోటార్ వెహికల్ కార్యాలయం ఆవరణలో రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా మానవాళికి ప్రాణవాయువు లభిస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా హెల్మెట్ విధిగా ధరించాలి అన్నారు. ప్రమాదంలో ఒక నిండు ప్రాణం బలేపోతే ఆ కుటుంబమంతా రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్‌టిసి డిఎం వేదుల శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకరరావు, ఎస్ఐ కె.గోపాల్‌రావు, ఆర్‌అండ్‌బి జెఇ జోగారావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, కార్యదర్శి బి.టి.రావు, ఇరిగేషన్ అధికారులు పి.శ్రీనివాసరావు, ప్రకృతి ప్రేమికులు చిన్నాచారి, ఎంవిఐ సహాయకులు దాసరి వైకుంఠరావు, డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వాహనదారులు రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యాన 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్లను కలెక్టరేట్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత పక్షోత్సవాలు-2023లో భాగంగా రహదారి భద్రతా వారోత్సవాలు ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీటు బెల్టు, హెల్మెట్ ధరించడం ప్రతిఒక్కరి విధి కావాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. మద్యం తాగి వాహనం నడపడం, మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. 18 ఏళ్లు దాటిన వారంతా చట్టపరంగా మోటార్ వెహికల్ లైసెన్సులను తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. వాహనాలు కండీషన్లో ఉండకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ సంభవిస్తున్నాయని చెప్పారు. చాలాచోట్ల బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సేఫ్టీ స్పాట్స్‌గా మార్చినట్లు తెలిపారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలుగుతున్నామన్నారు. ప్రయాణంలో మొబైల్ వాడకం, మద్యపానం, అతి వేగం వల్ల ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిటిసి శ్రీదేవి, ఆర్‌టిఒ దుర్గాప్రసాద్ రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తదితరులు

IN THE HONOURABLE COURT OF THE I ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.No. 132 / 2022
Between:
Malla Kannaji Rao & 2 OThers ...Plaintiffs
And:
Peela Sivaji & 4 Others . . . Defendants
To:
D-3 : Kona Venkata Ramana, S/o. Late Muka Lingam, D.No. 3-300/A, Jogipadigramam, Main Road, Koturu Mandal, Neradi Srikakulam District.
SUIT SUMMONS
That, you are the Defendant No. 3 in O.S.132/2022, on the file of honourable I Additional Senior Civil Judge, Visakha patnam, which has been filed by the plaintiffs against you and other defendants for permanent injunction, restraining you from interfering with their possession and enjoyment of the plaint schedule property. That, summons in the suit has not been served on you in ordinary way and that the honourable court was pleased to order summons to be served on you by substituted service by way of paper publication. The above suit stand posted on 20-10-2022 for your appearance. You are therefore hereby called upon to appear either in person or through a duly instructed council, before the honourable court on 01-02-2023 by 10-30 A.M., failing which the above suit will be decided in your absence as exparte.
(By order of the Court)
V.V.RAVI PRASAD
Advocates # 45-57-3/B, Ground Floor, Narasimha Nagar, Visakhapatnam - 24
Cell : 98485 69707

విక్టర్ జూనియర్ కళాశాల వద్ద సూచనలు చేస్తున్న ఎస్‌పి రాధిక

పరీక్షా కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కానిస్టేబుల్ పరీక్షకు సంబంధించి పరీక్షా కేంద్రాలను ఎస్‌జి జిఆర్.రాధిక గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, విక్టరి జూనియర్ కళాశాల, వంశధార విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాలను అమె పరిశీలించి, సంబందిత విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్‌కు పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా పరీక్షలు రాసేందుకు సదుపాయాలు కల్పించాలని, ఎస్‌ఐ మినహా ఎవరినీ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని అమె సూచించారు. అభ్యర్థులను గదుల్లోకి పంపించే ముందు ఒక చోట తనిఖీ నిర్వహించి, ఇతర, ఎటువంటి సామగ్రిని అనుమతించరాదని తెలిపారు. కార్యక్రమంలో పరీక్ష నోడల్ అధికారి జి.శ్రీనివాసరావు, స్థానిక ఎస్‌ఐ షేక్ ఖాదర్‌భాషా, చింతాడ అనిరుద్ధుడు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాంబాబు

ఎల్‌ఐసి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - పలాస

ఎల్‌ఐసి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలాస ఎల్‌ఐసి బ్రాంచ్ సంఘం అధ్యక్షులు పి.రాంబాబు, కార్యదర్శి ఎన్.సుబ్బారావు అన్నారు. పలాస ఎల్‌ఐసి కార్యాలయం వద్ద జీవిత బీమా వ్యాపార జాతీయకరణ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో జీవిత బీమారంగంలో ఉన్న 245 ప్రైవేట్ ఇన్సురెన్స్ కంపెనీలు అన్నింటినీ జాతీయం చేశారని అన్నారు. ఆ కంపెనీలు పాలసీదారులు కష్టపడి సంపాదించిన పొదుపు మొత్తాన్ని దోచుకుంటున్నారన్నారు. ఎల్‌ఐసి పనితీరు అద్భుతమని, 1956లో రూ.5 కోట్ల మూలధనంతో ప్రారంభమైన ఎల్‌ఐసి ఇప్పుడు రూ.42,30,617 కోట్లు ఆస్తులు, రూ.37,35,760 కోట్ల లైఫ్ ఫండ్ కలిగి ఉందని చెప్పారు. ఎల్‌ఐసి పెన్షన్, గ్రూప్ సూపర్యాన్యుయేషన్ వ్యాపారంలో అద్భుతమైన ప్రగతి కనబరుస్తోందని తెలిపారు. 2021-22 సంవత్సరంలో ఎల్‌ఐసి న్యూ బిజినెస్ ప్రీమియం ఆదాయం రూ.1,43,938 కోట్లు వసూలు చేయడం ద్వారా వరుసగా మూడేళ్ల పాటు ఒక ట్రిలియన్ మార్కును దాటిందని చెప్పారు. 14 దేశాల్లో ఎల్‌ఐసి తన కార్యాలయాలు కలిగి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఐసి ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి భవనానికి మోక్షమెప్పుడో!

- శిలాఫలకాలకే పరిమితమైన వైనం
- మహిళా సంఘాల సమావేశాలకు ఇబ్బందులు

పిచ్చిమొక్కలతో నిండిపోయిన పునాదులు

ప్రజాశక్తి - పొందూరు

మహిళా సాధికారితే తమ లక్ష్యమని, మహిళా అభ్యుదయానికి, మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఎంతగానో తోడ్పాటు అందిస్తున్నామని ప్రజాప్రతినిధులు సమావేశాల్లో పదేపదే చెప్పడం పరిపాటి. కానీ, మహిళా సాధికారత, ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ సంఘాలు నిర్వాహణ, కార్యకలాపాలు, సమావేశాల నిర్వాహణకు అనువైన కార్యాలయం లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు మహిళలు. దశాబ్ధాలు గడుస్తున్నా పొందూరు వెలుగు కార్యాలయానికి శాశ్వత భవనం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు.

వేసిన శిలాఫలకం

మండల మహిళా సమాఖ్య భవనం లేకపోవడంతో పొదుపు సంఘాల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2011 నుంచి వెలుగు కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మాణం నిర్మించేందుకు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు వేస్తున్నారే తప్ప భవన నిర్మాణం మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. దీంతో మహిళలు సమావేశాలు ఏర్పాటుకు, సంఘాల నిర్వాహణకు నానా అవస్థలు పడుతున్నారు.

సమావేశాలకు అవస్థలు

మండలంలో 1739 మహిళా పొదుపు సంఘాలు ఉండగా, ఇందులో 20,537 మంది సభ్యులు ఉన్నారు. అలాగే 38 మంది విఒఎలు, నలుగురు గురు సిసిలు, ఎఐపిఎంలు ఉన్నారు. మహిళా సాధికారత కోసం విరివిగా వివిధ రూపాల్లో రుణాలను ప్రభుత్వాలు మహిళలకు అందజేస్తున్నాయి. ఈ రుణాలను సద్వినియోగం పరుచుకునేందుకు మహిళలకు అవగాహన సమావేశాలను నిర్వహిస్తుంటాయి. ఈ సమావేశాలు నిర్వాహణకు అనువైన భవనం లేకపోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తుందంటూ పేర్కొంటున్నారు. ఇరుకైన గదిలోనే ఇబ్బందులు పడుతూ కూర్చోవాల్సి వస్తుందంటూ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వివిధ అవసరాల కోసం వచ్చే మహిళలకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు అనువుగా మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామంటూ వాపోతున్నారు. తమ సమస్యలు ప్రజాప్రతినిధులు, అధికారులకు పట్టడం లేదంటూ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

శిలాఫలకాలకే దర్శనమిస్తున్నాయి..

మండల పరిషత్తు కార్యాలయం ఆవరణంలో వెలుగు కార్యాలయానికి భవనం నిర్మాణం చేసేందుకు 2011లో సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అనంతరం 2019లో రూ.40 లక్షల నిధులతో భవన నిర్మాణానికి టిడిపి ప్రభుత్వం హయాంలో అప్పటి ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కూన రవికుమార్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి పునాదులు వేసి వదిలివేశారు. దీంతో ఇరువురు వేసిన శిలాఫలకాలే మిగిలాయి తప్ప భవన నిర్మాణానికి మాత్రం నోచుకోలేదు.

ఉన్నతాధికారులకు నివేదించా

వెలుగు కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మాణానికి సంబంధించి పునాదులు వేసి వదిలివేశారు. కార్యకళాపాలు నిర్వాహణకు అనువుగా లేకపోవడంతో ఇరుకైన గదిలోనే సమావేశాలు, రికార్డుల నిర్వాహణ చేయాల్సి వస్తుంది. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

- గురుగుబెల్లి శ్యామలరావు, ఎంపిఎం

ప్రతి గింజా కొనుగోలు చేయాలి

మాట్లాడుతున్న వెంకటరమణ

కొత్తూరు: రైతుల వద్ద నుంచి ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ డిమాండ్ చేశారు. స్థానిక కలమట కాంప్లెక్స్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 9 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని రైతులు పండిస్తే... ఇప్పటి వరకు ప్రభుత్వం 4 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసి చేతులు దులుకునేందుకు ప్రయత్నిస్తుందని అన్నారు. ప్రభుత్వం మిల్లర్ల కుమ్మక్కై రైతులను నట్టేట ముంచేస్తున్నారని విమర్శించారు. రైతులు సంక్రాంతి చేసుకోవడానికి బంగారం తాకట్టు పెట్టి మరీ పండగను చేసుకోవాల్సిన దుస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలను వర్షాలు, ఎలుకలు బారి నుంచి కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల తరుపున పోరాటాలకు టిడిపి సిద్ధంగా ఉందని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ దాస్‌నాయుడు, ఎల్.తిరుపతిరావు, శివ్వాల బాబుకిషోర్, కులశేఖర్ ఆళ్వార్, ఎద్దు శ్రీనివాసరావు, చింతాడ కోటి ఎం.శంకరరావు, ఎం.కృష్ణ, రామారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు ఆర్మీ క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - పలాస

పలాసలో శుక్రవారం ఉదయం 9.30గంటలకు తెలంగాణ- ఆంధ్రా సబ్ ఏరియా డిప్యూటీ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ బ్రిగేడియర్ కె.సోమశంకర్ సేనా మెడల్ ఆర్మీ క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు ఇళ్ల మన్మథరావు, తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ క్యాంటీన్ పరిధిలోకి పలాస, మందస, వజ్రపుకొత్తూరు, నందిగాం, మెళియాపుట్టి, పాతపట్నం, సంతబొమ్మాళి, ఇచ్ఛాపురం, కమిటి, కంచిలి, సోంపేట మండలాల్లోని మూడు వేల మంది మాజీ సైనికులకు, వీరనారీమణులు క్యాంటీన్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు.

చెక్కును అందజేస్తున్న కమలాకర్‌రెడ్డి

'అరబిందో' ఆర్థికసాయం

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని పున్నానపాలెంకు చెందిన పున్నాన గీతకు పైడిభీమవరం అరబిందో ఫార్మా స్యూటికల్స్ యాజమాన్యం ప్రతినిధి కమలాకర్ రెడ్డి రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. గీత కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అరబిందో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.లక్ష చెక్కును వైసిపి నాయకుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో సంచార సర్పంచ్ రెడ్డి రాము, పైడిభీమవరం మాజీ సర్పంచ్ లంకలపల్లి ప్రసాద్, దన్నాన హరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

వైసిపితోనే మహిళా సాధికారత

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

వైసిపితోనే మహిళా సాధికారత సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం మెప్మా ఆధ్వర్యాన మున్సిపాలిటీలోని తులసమ్మ డ్వాక్రా సంఘం, షిరిడి సాయి, విజయలక్ష్మి, శ్రీసాయి, వెంకటేశ్వర సంఘాల సభ్యుల సభ్యులతో రాజ్యలక్ష్మి సమావేశమయ్యారు. సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి, లబ్ధిపొందాలని కోరారు. సమావేశంలో రవికుమారి, ఆర్‌పిలు పాల్గొన్నారు.

ట్రోఫీని అందజేస్తున్న సర్పంచ్ ఆదినారాయణ

ముగిసిన క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - జి.సిగడాం

క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తుందని బాతువ సర్పంచ్ ఆదినారాయణ అన్నారు. మండలంలోని బాతువలో సంక్రాంతి సంబరాలు నేపథ్యంలో గ్రామ యువత క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. గురువారం నిర్వహించిన క్రికెట్ పోటీలో బాతువ కొత్తవీధి ప్రథమ, బాతువ సెగిడి ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు సర్పంచ్ ట్రోఫీలను, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపిటిసి బూటు అప్పారావు, పిఎసిఎస్ చైర్మన్ పల్లేడు సన్యాసిరావు, కె.కూర్మారావు, కూనిబుల్లి అప్పలనాయుడు, బూటు సన్యాసప్పడు, పి.శ్రీను పాల్గొన్నారు.

21, 22న ఉత్తరాంధ్ర రచయితల మహాసభ

ప్రజాశక్తి - పలాస

ఉత్తరాంధ్ర కలలు, సాహిత్యం పరిరక్షించుకునే ప్రయత్నంలో భాగంగా ఉద్దానం సాహితీ సంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీల్లో స్థానిక ఎస్‌ఎంసి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఉత్తరాంధ్ర రచయితల మహాసభలను తెలుగు భాషాభిమానులు, సాహితీవేత్తలు జయప్రదం చేయాలని ఆ వేదిక అధ్యక్షులు లండ రుద్రమూర్తి కోరారు. గురువారం స్థానిక సూర్యతేజ కళాశాల ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ మహాసభలకు ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ అందెశ్రీ, జైదేవ తిరుమలరావుతోపాటు కవులు, రచయితలు పాల్గొంటారని తెలిపారు. ఈ సభల్లో ఉత్తరాంధ్ర నాటక కళారూపాలు, ఉత్తరాంధ్ర యాస- భాషా, ఉత్తరాంధ్ర జానపదాలు, సాహిత్యరంగంలో ఉత్తరాంధ్రులు, ఉద్దానం ఉద్యమాలు- నేటి ప్రాసంగికత వంట అంశాలపై చర్చలు జరుగుతాయని,కవి సమ్మేళనం, పుస్తకావిష్కరణలు ఉంటాయని తెలిపారు. ఈ సభలకు ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల నుంచి రచయితలు, సాహితీవేత్తలు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక ప్రధాన సలహాదారులు తెప్పల కృష్ణమూర్తి, బండారి కాళిదాసు, కుత్తం వినోద్, శివజ్యోతి, గుమ్మిడి సంబమూర్తి, ప్రధాన కార్యదర్శి చిక్కోలు జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రత్నరాజు

80 మందికి వైద్య పరీక్షలు

పోలాకి: మండలంలోని బెలమర సచివాలయం పరిదిలో గుప్పిడిపేట పిహెచ్‌సి ఆధ్వర్యాన డాక్టర్ రత్నరాజు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 80 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. బిపి, షుగర్ ఇతర రకాల వ్యాధులకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవికుమార్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధాన గడువు పెంచాలి

టెక్కలి రూరల్ : పెన్షనర్ల గుర్తింపు నంబరుతో ఆధార్ నంబరు అనుసంధానం చేయడానికి గడువు పొడిగించాలని ఎపిటిఎఫ్ టెక్కలి మండలశాఖ గౌరవాధ్యక్షులు గున్న ప్రసాదరావు ఒక ప్రకటనలో కోరారు. 11వ తేదీన ఉత్తర్వులిచ్చి, 20లోగా ఆధార్ అనుసంధానం చేయాలని చెప్పడం సరికాదన్నారు. అవగాహన లేక పింఛనర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. సాంకేతిక కారణాలవల్ల చాలామంది ఆధార్‌ను అనుసంధానం చేయలేక పోతున్నారని, ప్రభుత్వం సానుభూతితో గడువును పెంచాలని కోరారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి - లావేరు

ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతనాయుడు, మాజీ ఎంపిపి దన్నాన రాజునాయుడులు పిలుపునిచ్చారు. మండలంలోని అదపాకలో సర్పంచ్ గొర్లె శశికళ ప్రభాకర్‌నాయుడుల ఆధ్వర్యాన శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో గురువారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజూ రోడ్డు, ఇతర ప్రమాదాల బాధితులకు సకాలంలో రక్తం అందకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు 30 మంది యువకులు పాల్గొన్న రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంకు ప్రతినిధులు, వైద్యులు వసుంధర, మాజీ సర్పంచ్‌లు గొర్లె అప్పలనాయుడు, నడిమింటి కిల్లారి మధు, గంట్యాడ చిన్నసూర్యనారాయణ, జడ్డు నర్సయ్య, వేమూరి రామకృష్ణశర్మ, ప్రభాకరరావు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద మోనును సక్రమంగా అమలు చేయాలని, రుచికరంగా వండి భోజనం పెట్టాలని సర్పంచ్ గొండు చాందిని సూచించారు. మండలంలోని దంత ప్రాథమికోన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీ వంట వారికి పలు సూచనలు చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గొండు నారాయణరావు, సర్పంచ్ ప్రతినిధి గొండు మురళి, చైర్మన్ లావేటి సింహాచలం, ఉపాధ్యాయులు జగన్మోహనరావు, రమణ, జ్యోతిలు పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ చాందిని

సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులుగా ఉదయ్‌కుమార్

సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - బూర్జ

సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కంట్లం పంచాయతీ సర్పంచ్ సూరాపు ఉదయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైసిపి మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు అధ్యక్షతన వైసిపి కార్యాలయంలో గురువారం సర్పంచ్‌ల సంఘం కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. గౌరవ అధ్యక్షులుగా చీదివలస సర్పంచ్ బూరి శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షులుగా కాలపర్తి సర్పంచ్ బి.వి.నాయుడు, ప్రధాన కార్యదర్శిగా వైకుంఠపురం సర్పంచ్ బొడ్డేపల్లి వెంకట సత్యం, కార్యదర్శిగా కొల్లివలస సర్పంచ్ జీడి వేణు, ప్రతిపాదికలుగా అల్లెన సర్పంచ్ జడ్డు దివ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఉదయకుమార్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, బిసిఎంఎస్ మెంబరు జల్లు బలరాంనాయుడు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఘనంగా వరుణ్‌తేజ్ జన్మదినం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సినీనటుడు వరుణ్ తేజ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ శ్రీకాకుళం బ్లడ్‌బ్యాంకులో మెగా అభిమానులు గురువారం రక్తదానం చేశారు. ఈ మేరకు 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమాన్ని అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను, సుధీర్ వర్మలు ప్రారంభించారు. ఏటా మెగా కుటుంబ సభ్యుల జన్మదిన వేడుకల్లో రక్తదానంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వరుణ్ తేజ్ అభిమాన సంఘం అధ్యక్షుడు శీర రాజు, ఉత్తరాంధ్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి వైశ్యరాజు మోహన్, పంకు మురళి, పవన్‌కళ్యాణ్ యువత ప్రతినిధులు గొర్లె కిరణ్ కుమార్, రామ్‌చరణ్ యువత అధ్యక్షుడు తైక్వాండో గౌతం, తేజ, అల్లు అర్జున్ ఫ్యాన్స్ అధ్యక్షుడు పుక్కల నవీన్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న అభిమానులు

విశ్వదాభివేమ.. కవి సార్వభౌమ

పలుచోట్ల ఘనంగా వేమన జయంతి

పలాస: చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు

'విశ్వదాభిరామ వినుర వేమ' అనే మాట వినని తెలుగువారుండరు. పామరులకు కూడా అర్థమయ్యేలా పద్యాలు చెప్పి, మెప్పించిన కవి వేమన. ఆటవెలదిలో అద్భుతమైన కవిత్వం, అనంత విలువలు గల సలహాలు, సూచనలు, తెలుగు సంగతులు ఇమిడ్చిన మహానుభావుడు వేమన. గురువారం ఆయన జయంతి సందర్భంగా జిల్లాలో పలు చోట్ల వేమన చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి - పలాస

మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో యోగి వేమన జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ వేమన కవితలు సరళమైన భాష, స్థానిక యాసలను ఉపయోగించడం వల్ల ప్రసిద్ధి చెందాయని చెటప్పారు. హెచ్‌ఎం కె.వైకుంఠరావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఎస్‌వి.రమణరావు, కె.శ్రీనివాసరావు, జనార్థనరావు, చిన్నారావు, లక్ష్మీబాయి, రాజేశ్వరి, విష్ణు, ఆచారి, రామన్నాయుడు, మోహనరావు, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వేమన జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలువేసి, నివాళులర్పించారు. వేమన పద్యాలు, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, వైసిపి నేతలు కె.మోహన్‌రావు, ఉప్పాడ రాజారెడ్డి, చిట్టి బాబు, శ్రీనివాసరావు, భాస్కర్, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం హనుమంతు నాయుడుపేట వైఎస్‌ఆర్సిపి పార్టీ కార్యాలయంలో జడ్పిటిసి పాలవసంత రెడ్డి ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి వసంత రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భర్త నక్క భీమారావు, హెచ్ ఎన్ పేట,యామాల పేట సర్పంచ్ ప్రతినిధులు పాల మహేష్, ముదిలి సంజీవ్, గుజ్జు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నౌపడ : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వసంతరెడ్డి

రెడ్డిక సంఘం ఆధ్వర్యాన...

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బాకర్‌సాహెబ్‌పేటలోని రెడ్డిక సంఘం కార్యాలయంలో జిల్లా రెడ్డిక సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ప్రజా కవి యోగి వేమన చిత్రపటానికి పూమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బల్లాడ జనార్ధన్‌రెడ్డి, నెడ్‌క్యాప్ కార్పొరేషన్ డైరెక్టర్ అలపాన త్రినాథరెడ్డి, ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బల్లాడ హేమాలిరెడ్డి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుక్క రాజశేఖర్‌రెడ్డి. ట్రెజరర్ వేణుగోపాల్‌రెడ్డి, కప్ప మాధవరెడ్డి, రత్నకుమారి, సుగుణరెడ్డి, ఘంటా రమణారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ జెండాతో యువకులు

మహేంద్రగిరిపై జాతీయ జెండా

పలాస: మండలంలోని సున్నాదేవి సైనికులు మహేంద్ర గిరిపై జాతీయ జెండాను అధిరోహించారు. పశ్చిమ కనుమలలో ఎత్తైన శిఖరాలు కావడం ప్రపంచ నలుమూలలకు జాతీయ జెండా కనిపించేలా ఉండాలన్న ఉద్దేశంతో మహేంద్ర గిరిపై జాతీయ జెండాతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సైనికులు గార బాబు రావు, గర్తం రమేష్, గర్తం గిరిబాబు, గర్తం మోహన్, తామాడ రేవతిపతి, పైల కళ్యాణ్, గర్తం బాలరాజు, పోతనపల్లి బాలరాజు తదితరులు ఉన్నారు.

23న ప్రత్యేక స్పందన

మెళియాపుట్టి : మండలంలోని నేలబొంతు ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 23న ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తహశీల్దార్ పి.సరోజిని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అథ్లెటిక్స్ పోటీలకు బారువ విద్యార్థులు

సోంపేట: ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి గ్రిక్స్ పోటీలకు బారువకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ మాధవరావు తెలిపారు. భారువకు చెందిన యాదం దిలీప్, తెప్పల శ్రీధర్, బడే కృష్ణారావు రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ఎస్‌ఎమ్‌ఎస్ కబడ్డీ క్లబ్ సభ్యులు, తోటి క్రీడాకారులు అభినందించారు.

క్లూస్ టీం పరిశీలన

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని డేగలపోలూరులో సేనాపతి దుర్యోధన ఇంటిపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తుపాకీ చూపి కత్తితో దాడి చేసి నగదు, బంగారాన్ని అపహరించుకుపోయిన విషయం విదితమే. వారి ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం సెంట్రల్ క్రైయిమ్ బ్రాంచ్ సిఐ జి.వి.రమణ, క్లూస్ టీం ఎస్‌ఐ భరత్ గురువారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రత్యక్ష సాక్షిగా ఉన్న సవర పార్వతిని విచారించారు. ఈ కేసుపై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నామని సిఐ తెలిపారు వీరితో పాటు పాతపట్నం సిఐ వినోద్‌బాబు, ఇన్‌ఛార్జి ఎస్‌ఐ కామేశ్వరరావు ఉన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న సిఐ రమణ

పరామర్శిస్తున్న గౌతు శిరీష

గౌతు శిరీష పరామర్శ

పలాస: మందస మండలం గొల్లలపాలెంకు చెందిన అందాల లక్ష్మీనారాయణ అనారోగ్యంతో కాశీబుగ్గ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష గురువారం రాత్రి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. యోగ క్షేమాలను, ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, దాసరి తాతారావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, బి.నాగరాజు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

ప్రజాశక్తి - పోలాకి

ఈదులవలస ఎపి మోడల్‌స్కూల్ అండ్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థిని యారబాటి మౌనిక ఇటీవల నిర్వహించిన సౌత్ ఇండియా తైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. గురువారం ఆ విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ ఆధ్వర్యాన సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ముద్దాడ బాల భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి బొజ్జ జగన్నాథం, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఎం.నీలం, రామకృష్ణ, శ్రీరాములు, శ్రీనివాసరావు, బాలమురళీకృష్ణ, రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.


మౌనికను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

సహజ వనరులను కాపాడుకుందాం

అభినందిస్తున్న వాకర్సు

శ్రీకాకుళం అర్బన్ : ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవసరం, ఆవశ్యకతను గుర్తు చేస్తూ కాలుష్య రహిత సమాజం కోసం కలకతా్తకు చెందిన సైకిల్ యాత్రికులు ఆశిమ్, మింటూ బయలు దేరారు. ఈ నెల మొదటి వారంలో కలకత్తా నుంచి సైకిల్ యాత్రకు బయలు దేరిన వీరు గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. వీరికి స్టార్ వాకర్సు అధ్యక్షులు శాసపు జోగినాయుడు ఆధ్వర్యాన సాదరంగా స్వాగతిం చారు. జర్నీ విత్ మ్యూజిక్ పేరుతో చేపట్టిన ఈ సైకిల్ యాత్ర సజావుగా సాగాలని అభిప్రాయపడ్డాడు. కాలుష్య రహిత సమాజం కోసం ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరాన్ని సైకిల్ యాత్రికులు గుర్తుచేశారు. వాకర్సు సంస్థల తోడ్పాటు అవసరమని వారు కోరారు. ఏడాది కాలం పాటు సాగే భారత్ యాత్ర లడక్ చేరుకొని అక్కడ నుంచి తిరిగి ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, వెస్ట్‌బెంగాల్ చేరుకుంటామని వారు తెలిపారు. సేవ్ యువర్ వరల్డ్ ఇన్ యువర్ ఓన్ వే... నినాదంతో భారత్ యాత్ర సాగుతుందని వెల్లడించారు.

ఇంటింటికీ తాగునీరు

శంకుస్థాపన చేస్తున్న తిలక్

ప్రజాశక్తి- నందిగాం

ప్రతి ఇంటికీ తాగునీరు కల్పించడమే సిఎం జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎపి కళింగ కార్పొరేషన్ చైర్మన్‌పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని పాలవలస గ్రామంలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించే పనులకు ఎంపిపి శ్రీరామ్మూర్తితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. తిలక్ మాట్లాడుతూ మార్చిలోగా అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కె.బాలకృష్ణారావు, ఎస్.బైరాగి, వైస్ ఎంపిపిలు ఎస్.వసంతకుమార్, టి.పాల్గుణరావు, ఎంపిటిసి పూడి ఆశారాణి, అంబోడి విష్ణు, సర్పంచ్‌లు బి.సన్యాసిరావు, ఎం.సంజీవరావు, రాజు, సీతారాం, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నూకలూరులో పొలంబడి

పొలంబడి నిర్వహిస్తున్న ఎఒ నరసింహమూర్తి

సోంపేట: మండలంలోని నూకలూరు గ్రామంలో గురువారం వైఎస్ఆర్ పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ నరసింహమూర్తి మాట్లాడుతూ వేరుశనగ పంట గురించి అవగాహన కల్పించారు. నాటిన 25 నుంచి 30 రోజుల్లో కాండం కుళ్లు తెగులు సాధారణంగా కనిపిస్తుందన్నారు. దీన్ని నివారించడానికి కాపర్ ఆక్సిక్లోరైడ్ ద్రావణం పిచికారి చేయాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పున్నయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గ్రామ సారథుల ఎంపిక ప్రక్రియ వేగవంతం

కోటబొమ్మాళి: గ్రామ సారథుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని మండల సచివాలయ ఇన్‌ఛార్జి కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు అన్నారు. మండల విప్ బొడ్డు అప్పన్నతో కలిసి అక్కయ్యవలస, కొత్తపేట పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసిలు, వైసిపి నాయకులతో నాయకులతో గురువారం సమావేశం నిర్వహించి ఎంపిక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజా, సర్పంచ్ సుకన్య, జనార్ధనరెడ్డి, శివారెడ్డి, బూత్ కన్వీనర్ మక్క అదినారాయణ, డొక్క వెంకటరావు పాల్గొన్నారు.

టిడిపి నగరాల సాధికార కమిటీ చైర్మన్‌గా వెంకునాయుడు

శ్రీకాకుళం అర్బన్ : తెలుగుదేశం పార్టీ జిల్లా నగరాల సాధికారిత కమిటీ చైర్మన్‌గా నల్లాన వెంకునాయుడును నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం నియామకపు పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఆయనతో పాటు 14 మంది సభ్యులను ఈ కమిటీలో నియమించారు. నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన వెంకునాయుడు పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని, పార్టీ విజయానికి తన వంతు కృషి చేయాలని రవికుమార్ సూచించారు.

రీ సర్వే డిటిగా ఈశ్వరరావు

ఈశ్వరరావు

కవిటి: మండల రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా బి.ఈశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. పొందూరు రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న ఈశ్వరరావు ఉద్యోగోన్నతిపై కవిటి రీ సర్వే డిటిగా చేరారు. తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, డిప్యూటీ తహశీల్దార్ టి.రామచంద్రరావు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఈశ్వరరావుకు అభినందనలు తెలిపారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం

అయ్యప్ప ఆలయానికి విరాళం అందిస్తున్న యాత్రికులు

ఇచ్ఛాపురం: మండలంలోని కొలిగాం గ్రామానికి చెందిన 13 మంది అయ్యప్ప స్వాములు మాలధారణ అనంతరం తమ వద్ద మిగిలిన రూ.30000లు నగదును గురువారం లొద్దపుట్టి అయ్యప్ప ఆలయానికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, దుర్యోధన చలపతి, కుమారస్వామి, కోటేసు, అజిత్ మహారాణ, కృష్ణారావు, హరీష్, సురేష్, వెంకట్, అన్వేష్, కామేషు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడప గడపకు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని చీమలవలసలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాల ఒరవడిని కొనసాగిస్తున్నారన్నారు. అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదును జమ చేసి ఆర్థిక భరోసాను కల్పిస్తున్నారని అన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నది, లేనిది లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎంపిటిసి కూటికుప్పల ఉషారాణి, ఎంపిడిఒ ఎం.రేణుక, ఎపిఎం పైడి కూర్మారావు, సివిల్ సప్లయి డిటి దువ్వాడ అమర్నాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ చంద్రమౌళి, మండల ఇంజినీరింగ్ అధికారి జ్యోతి పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

మెళియాపుట్టి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పలాస: వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గడప గడపకు వచ్చి తెలుసుకొని పరిష్కరిస్తామని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 26వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ముందుగా వార్డ్ పరిధిలో ఉన్న వీధుల్లో పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమన్నారు. త్వరలో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించి నీటి సమస్యను అధిగమిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, ఎఎంసి చైర్మన్ పివి.సతీష్, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, మున్సిపల్ అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జనరంజకంగా ప్రభుత్వ పాలన

కవిటి : అభివృద్ధి, సంక్షేమం అనే రెండు కళ్లతో సిఎం జగన్మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నట్లు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి కె.పద్మ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పూడి లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన చూసి ఓర్వలేని విపక్షాలు కుటిల రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఎవరెన్ని పగటి కలలు కన్నా మళ్లీ వైసిపిదే అధికారమని వీరు జోస్యం చెప్పారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అమలుతీరు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల పనితీరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, సీడాప్ చైర్మన్ స్యాడి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిటిసిలు పూడి నీలాచలం, దుద్ది సతీష్, ఎంపిటిసి ప్రతినిధి దుద్ది ధర్మారావు, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, బెందాళం రమణ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలోని వేల్పురాయి, దేవరాపల్లో గ్రామాల్లో ఎమ్మెల్యే గొర్లె కిరణ్కుమార్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వైసిపి మండల అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, సర్పంచ్‌లు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ధనుంజయరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రామారావు, విద్యుత్‌శాఖ ఎఇ శ్రీనివాసరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మంగమ్మ పాల్గొన్నారు.

రణస్థలం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

కవిటి : సంక్షేమ పథకాల అమలు తీరు తెలుసుకుంటున్న విజయ

మెళియాపుట్టి: మండలంలోని వసుంధర గ్రామంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి జి.ఎండయ్య, వైసిపి మండల కన్వీనరు పల్లియోగి, పిఎసిఎస్ అధ్యక్షులు బాలరాజు, సర్పంచ్‌లు సలాన అప్పలనాయుడు, జనపరెడ్డి కన్నబాబు, పెద్దింటి చందర్రావు, ఎంపిటిసి సభ్యులు సలాణ చిట్టి, పోలాకి జై మునిరావ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి

వివరాలను నమోదు చేస్తున్న అపూర్వ

పోలాకి : ప్రభుత్వం సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎం.ఈశ్వర రావు ఒక ప్రకటనలో సూచించారు. మండలంలోని పల్లిపేట, ఉరజాం, ధీర్ఘాశి, అంపలాం, డి.ఎల్.పురం తదితర సచివాలయాల్లో ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆధార్ నమోదులో ఏవైనా తప్పులు ఉంటే ఇప్పుడే సరిచేసుకోవాలన్నారు. అలాగే కొత్త ఆధార్ కార్డులు నమోదు, అడ్రస్ మార్పు వంటివి సరిచేస్తున్నారని చెప్పారు. మరో వారం పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు.

విద్యార్థినికి అభినందనలు

అభినందిస్తున్న హెచ్‌ఎం పద్మావతి

బూర్జ : మండలంలోని కె.కె.రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పరుగు పందెం లో తన ప్రతిభను చాటింది. గతనెల జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వెయ్యి మీటర్ల పరుగు పందెంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్.మాధురి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ప్రధానోపాధ్యాయులు టి.పద్మావతి పాఠశాల ఆవరణలో గురువారం అభినందనలు తెలిపారు. అ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు శ్రీకాకుళం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు మాదిరి ఎంపికైందన్నారు. తన ప్రతిభతో పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి పాఠశాలకు ఎనలేని కీర్తి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో పిఇటి అప్పలన్న, ఉపాధ్యాయులు వి.రాజేశ్వరి పాల్గొన్నారు.

గరుడభద్రలో 'ఉపాధి' ప్రారంభం

కూలీలతో మాట్లాడుతున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గరుడభద్రలో సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావు గురువారం ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తామాడ చంద్రయ్య తోట నుంచి నర్తు అనసూయమ్మ తోట వరకు ఉన్న గొర్జి పనులు ఉపాధి హామీ చట్టం ద్వారా చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో రైతులకు రహదారి సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఆక్రమణకు గురైన రహదారి తిరిగి రైతులకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు వై.ధర్మారావు, గూడ భాస్కరరావు, టెక్నికల్ అసిస్టెంట్ మడ్డు పాపారావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఎ.జగన్నాథముని, టి.అప్పలస్వామి, చేల్లూరు ధనరాజ్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ ప్రక్రియ పరిశీలన

పరిశీలిస్తున్న జయంతి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని ఆర్‌బికె కేంద్రాల ద్వారా విక్రయిస్తున్న ధాన్యం సేకరణ ప్రక్రియను జిల్లా పౌర సరఫరాలశాఖ మేనేజర్ ఎం.జయంతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వద్ద బియ్యం దిగుమతులను పరిశీలించారు. ఆర్‌బికె కేంద్రాల నుంచి ధాన్యం ఆలస్యంగా వస్తుండడంపై ఆరా తీశారు. ప్రస్తుతం వరి దిగుబడి అధికంగా ఉన్నందున ఆర్‌బికె కేంద్రాల కొనుగోలు సామర్థ్యం పెంచాలని ఎఒ నరసింహమూర్తి ఆమెను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం

కోలాటమాడుతున్న చిన్నారులు

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలోని మధుపాంలో దుర్గాదేవి అమ్మవారి మహోత్సవ యాత్ర సర్పంచ్ బోగాది అప్పలనాయుడు అధ్యక్షతన మూడు రోజుల పాటు నిర్వహించారు. గురువారం చివరి రోజు కావడంతో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొని అమ్మవారిని ఊరేగించారు. ఏటా దుర్గాదేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఊరేగింపులో చిన్నారుల కోలాటం అందరినీ అలరించింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాలను అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన టిడిపి నాయకులు



చంద్రబాబును కలిసిన సంతోష్‌కుమార్, సిద్ధార్థ

ఇచ్ఛాపురం: నారా చంద్రబాబునాయుడును తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ సభ్యులు ఉనా సంతోష్‌కుమార్, మల్ల సిద్ధార్థ గురువారం కలిశారు. ఉండవల్లిలోని తన నివాసంలో నారా లోకేష్ తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉండవల్లి వెళ్లిన ఇచ్ఛాపురం వాసులు నారా చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా వారికి సూచనలతో పాటు దిశా నిర్దేశం చేశారు.